సాక్షి
అనంతపురం

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.14, సరాసరి రూ.17 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

22 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో 22 మండలాల్లో వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. విడపనకల్లు 30 మి.మీ, నార్పల 22.2, యల్లనూరు 18.8 మి.మీ వర్షం కురిసింది. అలాగే, శింగనమల, పుట్లూరు, కళ్యాణదుర్గం, గార్లదిన్నె, పెద్దవడుగూరు, తాడిపత్రి, అనంతపురం, గుత్తి, ఆత్మకూరు తదితర మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ఇప్పటివరకు 71.7 మి.మీ నమోదైంది. ఓవరాల్‌గా జూన్ ఒకటి నుంచి ఈ సీజన్‌లో 269.5 మి.మీ గానూ 18.8 శాతం అధికంగా 320.2 మీ.మీ వర్షం కురిసింది. 15 మండలాల్లో అధికంగా, 13 మండలాల్లో సాధారణం కాగా మిగతా మూడు మండలాల్లో తక్కువగా వర్షపాతం నమోదైంది. 26 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

యాడికి: ఫర్టిలైజర్ దుకాణాల్లో తేడా ఉన్న ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు. శనివారం రాయలచెరువు గ్రామంలో ఉన్న న్యూ లక్ష్మీ వెంకటేశ్వర, లక్ష్మీ వెంకటేశ్వర, భాస్కర్ ఫర్టిలైజర్స్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషాతో కలిసి విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్, విజిలెన్స్ ఎస్‌ఐ నరేంద్ర భూపతి తనిఖీ చేశారు. న్యూ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులు సరిగా లేని రూ.1,85,000 విలువ గల 5 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సాయీ..సర్వమూ నీవేనోయి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: 'సాయీ..సర్వమూ నీవేనోయీ' అంటూ ఏలూరు జిల్లా సత్యసాయి భక్తులు సంగీత కచేరీ నిర్వహించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఏలూరు సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ వారు చేసిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.

కొత్త సారుపై కొండంత ఆశ

రెవెన్యూ శాఖలో కారుణ్య నియామకాలు, ఉద్యోగులకు పదోన్నతులు కలగా మారాయి. ఈ విషయంలో అన్ని శాఖలకు మార్గదర్శకంగా ఉండాల్సిన 'రెవెన్యూ'.. గత అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా విమర్శలను మూటగట్టుకుంది. అంతులేని జాప్యంతో నిర్లిప్తతకు లోనైన బాధిత కుటుంబాల వారు, ఉద్యోగులు నూతన కలెక్టర్ ఆనంద్‌పై కొండంత ఆశపెట్టుకున్నారు.



- పెండింగ్‌లో కారుణ్య నియామకాలు
- కళ్లకు కాయలు కాసేలా బాధిత కుటుంబాల ఎదురుచూపులు
- రెవెన్యూలో నిలిచిన పదోన్నతులు
- కరుణ చూపాలంటున్న ఉద్యోగులు

పెండింగ్ ఇలా...

కారుణ్య నియామకాలు	104
పదోన్నతులు	
జూనియర్ అసిస్టెంట్	9
సీనియర్ అసిస్టెంట్	32
డిప్యూటీ తహసీల్దారు	17
సీఎస్ డిప్యూటీ తహసీల్దార్లు	26

అనంతపురం అర్బన్: ఒక ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబాన్ని ఆర్థిక సమస్యలతో పాటు ఇతర ఇబ్బందులు చుట్టుముడతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని, మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఆసరా కల్పిస్తూ కుటుంబంలో ఒకరికి వీలైనంత త్వరగా కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తారు. ఈ కారుణ్య నియామకాలు కలెక్టర్ కార్యాలయం నుంచి జరుగుతాయి. ఈ ఏడాది మే నాటికి 32 కారుణ్య నియామకాలు కల్పించాల్సి ఉండగా నాలుగు నెలల్లోనే ఆ సంఖ్య 104కు చేరింది. ఒకవైపు కుటుంబ పెద్దదిక్కు లేదన్న బాధ.. మరో వైపు పోషణ భారం వెరసి ఉద్యోగం ఎప్పుడిస్తారా అని కలెక్టర్ కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారుల నుంచి మాత్రం స్పందన లేకపోవడంతో వారి ఆవేదన వర్ణనాతీతంగా మారింది. కష్టం బయటికి చెప్పుకుంటే ఎక్కడ ఇబ్బంది పెడతారో అని ఆందోళన చెందుతున్నారు.

పదోన్నతుల కోసం ఎదురు చూపు

రెవెన్యూలో పదోన్నతుల కోసం కిందిస్థాయి ఉద్యోగులు కళ్లకు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. గత కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా కరుణించలేదని ఉద్యోగులు వాపోతున్నారు. వివిధ కేడర్లలో పోస్టులు ఖాళీ ఉండి, పదోన్నతికి అర్హత సాధించిన వారు ఉన్నప్పటికీ ఆ విషయంపై దృష్టి సారించలేదని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మినహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లో పదోన్నతుల ప్రక్రియ ఎప్పుడో పూర్తయ్యిందని ఉద్యోగులు చెబుతున్నారు.

జేఏలకు భాగ్యమేదీ?

రెవెన్యూ శాఖలో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ (జేఏ) పోస్టులు 9, సీనియర్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులు 32, డిప్యూటీ తహసీల్దారు (డీటీ) పోస్టులు 17, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దారు (సీఎస్ డీటీ) పోస్టులు 26 ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటినీ పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఇక.. జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తారు. జేఏలు తప్పనిసరిగా సర్వే, డిపార్ట్‌మెంటల్, అకౌంట్, తదితర పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అయితే, అన్ని టెస్టులు పాసై అర్హత సాధించిన వారు 30 మంది ఉన్నారు. శాఖలో 32 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన వీఆర్‌ఓలకూ ఎస్ఏలుగా పదోన్నతి కల్పిస్తారు. మొత్తం ఖాళీల్లో వీఆర్‌ఓలు, జేఏలకు 40:60 నిష్పత్తిలో పదోన్నతి కల్పిస్తారు. వీఆర్‌ఓలకు పదోన్నతి ఇప్పటికే కల్పించారని, తమ విషయంలో జాప్యం చేశారని జేఏలు ఆవేదన చెందుతున్నారు.

డీటీలుగా పదోన్నతి దక్కేనా..?

ఎస్ఏలకు డీటీలుగా పదోన్నతి కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం డీటీలుగా పదోన్నతి పొందేందుకు అర్హులైన ఎస్ఏలు 15 మంది ఉన్నారు. అయితే ఈ ప్రక్రియ నెలలుగా ముందుకు సాగకపోవడంతో వారికీ ఎదురు చూపులు తప్పడం లేదు. పీబీడీటీలు వచ్చినా పోస్టుల విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాకు కేటాయించిన పీబీడీటీలు ఏడాది పాటు శిక్షణలో ఉంటారని, అటు తరువాత పీబీడీటీలకు సంబంధించి ప్రభుత్వం సూపర్‌న్యూమరరీ పోస్టులు మంజూరు చేస్తుందని చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం సూపర్‌న్యూమరరీ పోస్టులు మంజూరు చేయకపోయినా రెగ్యులర్ డీటీలను సీఎస్‌డీటీలుగా నియమించి, వారి స్థానంలో పీబీడీటీలను నియమించవచ్చంటున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- కలెక్టర్ ఆనంద్



స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. జంబులదిన్నె కొట్టాల సమీపంలో మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు సాగు చేసిన పండ్ల మొక్కలు, వేరుశనగ పంట పొలాలు పరిశీలించారు. గార్లదిన్నె డంపింగ్ యార్డును పరిశీలించి 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర'పై అధికారులు, సిబ్బంది, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదన్నారు. ఇంటి వద్దకే గ్రీన్ అంబాసిడర్లు వచ్చి తడి, పొడి చెత్తను సేకరిస్తారన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. అక్టోబర్ 2 లోపు అన్ని గ్రామాలు స్వచ్ఛంగా మారాలన్నారు. రైతులు పొలాల్లో ఫారం పాండ్లు తవ్వుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల్లో మట్టి తవ్వకం చేపట్టాలన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు సుబ్బమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీపీఓ నాగరాజు నాయుడు, డీఏఓ ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 22వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

అధికార అండతో భూమి కబ్జా

- కోర్టు ఆర్డర్‌నూ లెక్క చేయని టీడీపీ నాయకులు
- బాధితుడికి పోలీసు రక్షణ కల్పించి పొలంలోకి తీసుకెళ్లాలి
- అధికార పార్టీకి తొత్తుగా మారిన కూడేరు సీఐపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి
- ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం



ఎస్పీకి వినతి పత్రం అందించి బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, వైఎస్సార్ సీపీ నాయకులు

ఉరవకొండ: అధికారాన్ని అడ్డు పెట్టుకుని దౌర్జన్యంగా అమాయకుల భూమిని కబ్జా చేయాలని చూస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఎస్పీ జగదీష్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడపనకల్లు మండలం జనార్దన్‌పల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నం. 141లోని 21.05 ఎకరాలను 2023 జూన్ 4న రైతు జయకుమార్ కొనుగోలు చేసి, పంటలు సాగు చేస్తున్నాడన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ భూమిపై జనార్దన్‌పల్లి సర్పంచ్ రామంగి జనార్దన్‌నాయుడు, టీడీపీ నాయకులు సుధాకర్, పాండురంగ, కురపాటి కృష్ణమూర్తి కన్నేశారన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఇటీవల రైతు జయకుమార్‌పై దౌర్జన్యానికి దిగారన్నారు. రైతును పొలంలోకి రానివ్వకుండా అడ్డు పడుతున్నారన్నారు. దీనిపై న్యాయస్థానం ఇంజెంక్షన్ ఆర్డర్ ఇచ్చినా ఏ మాత్రమూ లెక్కచేయడం లేదన్నారు. బాధిత రైతుకు పోలీసు రక్షణ కల్పించి తన పొలంలో పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు.

కూడేరు సీఐపై చర్యలు తీసుకోవాలి..

కూడేరు సీఐ రాజు వైఎస్సార్‌సీపీ శ్రేణులెవ్వరూ పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కరాదని అంటున్నారని, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సైతం ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నాడని విశ్వ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల 70 ఏళ్ల వయసున్న అంతరగంగ సర్పంచ్ ఓబుళేసు స్టేషన్‌కు వెళితే బూతులు తిట్టి తీవ్రంగా అవమానపరిచాడన్నారు. తమ పార్టీలో చురుగ్గా ఉన్న నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. బోర్‌వెల్‌తో జీవనం సాగిస్తున్న మరుట్ల-1 గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త శ్రీనివాసులుపై కక్ష కట్టి ఉపాధి దెబ్బతీశాడన్నారు. బోరు బండి కావాలంటే టీడీపీ కండువా వేసుకోవాలంటూ శ్రీనివాసులును హెచ్చరించాడన్నారు. అధికార పార్టీకి తొత్తులా వ్యవహరిస్తున్న సీఐ రాజుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి దేవేంద్ర, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లత్తవరం కొడిగి గోవిందు, కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్‌రెడ్డి, మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మరుట్ల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

తప్పుడు ప్రచారంతో తండోపతండాలుగా



తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తులు రాయించుకుంటున్న వితంతువులు

తాడిపత్రి రూరల్: బస్సు దొరకలేదంటే ఆటోలు పట్టుకునో... అవీ లేకుంటే మనవడో, కుమారుడినో ప్రాధేయపడి ద్విచక్రవాహనాల్లోనో తరలివస్తున్నారు. దరఖాస్తులు ఇవ్వకుంటే ఎక్కడ డబ్బులు అందకుండా పోతాయోనన్న భయంతో పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నారు. త్వరలో ప్రభుత్వం ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అమలు చేస్తుందని, ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుంటే వితంతులకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తారని ఇటీవల కొందరు తప్పుడు ప్రచారం చేస్తుండడంతో పేద మహిళలు తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయానికి తండోపతండాలుగా తరలివస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారితో శనివారం తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు రద్దీగా మారాయి. కార్యాలయం సమీపంలోని జిరాక్స్ సెంటర్ వద్ద దరఖాస్తులు తీసుకొని, వాటిని నింపాక గాబారా పడుతూ కార్యాలయంలో అందించడం కనిపించింది. రోజు కూలి వదులుకుని మరీ కొందరు రావడం గమనార్హం. అలాంటి పథకమేదీ లేదని, డబ్బులు రావని చెబుతున్నా వినకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దరఖాస్తులు తీసుకుంటున్నామని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. కాగా, ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ సోమశేఖర్ వివరణ కోరగా ఆయన స్పందించారు. ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఈ విషయం తెలిపినా వితంతువులు వినడం లేదని చెప్పారు. అసత్య ప్రచారాలను నమ్మొద్దని కోరారు. ఏవైనా ఉత్తర్వులు వస్తే సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

టీడీపీ నేత ఇసుక దందా బట్టబయలు



ఇసుక డంప్‌ను చూపుతున్న సీఐ

గుమ్మఘట్ట: టీడీపీ నేతల ఇసుక దందాకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. అడ్డదారుల్లో ఇసుకను కర్ణాటకకు తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గుమ్మఘట్ట మండలంలోని వేపులపర్తి క్రాస్, భూపసముద్రం గ్రామాల సమీపంలో ఉన్న వేదావతి హగరి నుంచి నిత్యం పదుల సంఖ్యలో వాహనాల్లో ఇసుకను టీడీపీ నేత అశోక్ తరలించి సిరిగెదొడ్డి గ్రామ సమీపంలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళ బెంగళూరుకు టిప్పర్ల ద్వారా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అశోక్ ఇసుక దందాపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు స్పందించి దాడులు నిర్వహించారు. శనివారం సిరిగెదొడ్డి సమీపంలో డంప్ చేసిన ఆరు ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి టీడీపీ నేత అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు.

టిప్పర్ కింద పడి యువకుడి దుర్మరణం



మందల శ్రీకాంత్ (ఫైల్)

రాప్తాడు: టిప్పర్ కింద పడి యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని గొందిరెడ్డిపల్లిలో జరిగింది. వివరాలు.. మండలంలోని రామినేపల్లికి చెందిన మందల శ్రీనివాసులు, రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. శ్రీనివాసులు శ్రీ సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి సమీపంలో 2 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని టమాట పంట సాగు చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం శ్రీనివాసులు చిన్న కుమారుడు మందల శ్రీకాంత్ (28) ద్విచక్ర వాహనంలో తోట దగ్గరకు వెళ్లి పంటకు పురుగుల మందు పిచికారీ చేసిన అనంతరం తిరుగుపయనమయ్యాడు. గొందిరెడ్డిపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా టిప్పర్ వస్తుండడాన్ని గమనించి ద్విచక్ర వాహనాన్ని పీర్ల చావిడి వెనుక వైపు మలుపు వద్ద ఆపాడు. అయితే, డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో బైకును టిప్పర్ ఢీకొంది. ఈ క్రమంలోనే కిందపడిన శ్రీకాంత్‌పై టిప్పర్ చక్రాలు వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు ఘటనా స్థలికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి వేధింపులు

- కేసుల మీద కేసులు పెట్టి వేధిస్తున్న ప్రభుత్వం
- తాజాగా మరోసారి రిమాండుకు



మెగా అంజాద్

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కదిరి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు మెగా అంజాద్‌పై కూటమి సర్కారు వేధింపులు కొనసాగుతున్నాయి. మెగా అంజాద్ వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సర్కారుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అంజాద్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. సుమారు నెల రోజులు రిమాండ్‌లో ఉన్నారు. అనంతరం కొద్ది రోజులకు భార్య పేరిట భూమి కబ్జా చేశాడని పోలీసులకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో మరోసారి తప్పుడు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కదిరిలోని రాయలసీమ సర్కిల్‌లో తన రెడీమేడ్ దుస్తుల దుకాణంలో ఉండగా మెగా అంజాద్‌పై కొందరు టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. దీనిపై ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే..పోలీసులు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా.. దెబ్బలు తిన్న అంజాద్‌పై కేసు కట్టి సబ్ జైలుకు తరలించారు.

తాజాగా మరో కేసు

తాజాగా ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేష్‌కు వ్యతిరేకంగా అంజాద్ ఫేస్‌బుక్ ఐడీపై పోస్టు వచ్చిందని, కావున ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపాలని ఐజీ కార్యాలయం నుంచి స్థానిక పోలీసులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో డీఎస్పీ వెంకట శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

టమాట ధర నేలచూపు

- 20 రోజులుగా తగ్గుముఖం
- పడిపోయిన ఎగుమతులు
- పెట్టుబడులూ తిరిగిరాని వైనం
- గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్న రైతులు




కళ్యాణదుర్గం మండలం గోళ్ల వద్ద సాగు చేసిన టమాట పంట, బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లి వద్ద టమాట పంటను పొలాల్లోనే వదిలేసిన దృశ్యం

కళ్యాణదుర్గం: ఆకాశాన్నంటిన టమాట ధరలు ఒక్కసారిగా నేల చూపులు చూస్తున్నాయి. గడిచిన 20 రోజులుగా ధరలు తగ్గుముఖం పట్టాయి. పెట్టుబడులు సైతం తిరిగిరాకపోతుండటంతో పంటను పొలాల్లోనే వదిలేసే పరిస్థితి దాపురించింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఏటా దాదాపు 10 వేల ఎకరాల్లో టమాట సాగవుతోంది. గడిచిన నెల రోజుల ముందు పంటకు మంచి ధరలు లభించాయి. ముఖ్యంగా ఇక్కడి టమాటాలకు మంచి గిరాకీ ఉంది. ఇక్కడి నుంచి మదనపల్లి, బెంగళూరు, కోలార్, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. అయితే అక్కడ స్థానికంగా సరుకు మార్కెట్‌కు రాకపోవడం.. ఇక్కడి పంటకు ధరల పెరుగుదలకు కలిసొచ్చింది. టమాట రైతులకు ఈ ధరలు కొంత ఊరటనిచ్చాయి. ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. ఎగుమతులు లేకపోవడంతో రైతులు పంటను దిబ్బలకు తరలించే పరిస్థితి దాపురించింది. మదనపల్లె మార్కెట్లో 15 కిలోల టమాట బాక్సు రూ.150కు మించడం లేదు.

కిలో రూ.10 కూడా పలకడం లేదు

ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాట రూ.10 ధర పలుకుతోంది. కొందరు రైతులు పంటను తొలగించేందుకు కూలీల ఖర్చులు కూడా రావడం లేదని.. పశువుల మేతగా వదిలేస్తున్నారు. నెల క్రితం కిలో టమాట రూ.30 నుంచి రూ.40 వరకు పలికింది. ఉన్నపళంగా ధరలు పడిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

తగ్గిన ఎగుమతులు

నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో టమాట దిగుబడులు వస్తున్నాయి. అయితే ఎగుమతులు లేవని మార్కెట్ నిర్వాహకులు చెబుతుండటంతో పంటను మార్కెట్లకు తరలించలేని పరిస్థితి. ఇక పొరుగు జిల్లాలోని మదనపల్లె, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో స్థానికంగా టమాట అందుబాటులోకి రావడంతో ఇక్కడి వాటికి ఎగుమతులు లేక ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు.

పెట్టుబడి వచ్చే అవకాశమే లేదు



నేను రూ.1.30 లక్షలు పెట్టుబడులు పెట్టి ఒకటిన్నర ఎకరంలో టమాట సాగు చేశాను. ప్రస్తుతం టమాట ధరలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోతోంది. నెల క్రితం మార్కెట్లో కిలో 15 కిలోల క్రేట్ ధర రూ.600 వరకు పలికింది. వారం రోజులుగా ధరలు దారుణంగా పడిపోయాయి.

– నాగభూషణ, రైతు, కలిమిగొలిమి, కుందుర్పి మండలం

పొలంలోనే వదిలేశా



రెండు ఎకరాల విస్తీర్ణంలో టమాట పెట్టాను. రూ.2 లక్షల దాకా పెట్టుబడి అయ్యింది. పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్లో సరైన ధర లేదు. దీంతో పంటను పొలంలోనే వదిలేయాల్సి వచ్చింది. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలి.

– జి.కిష్టప్ప, రైతు, ముప్పులకుంట, బ్రహ్మసముద్రం మండలం

క్లుప్తంగా

సమస్యలపై నిరసనకు శ్రీకారం



కలెక్టర్‌ను సన్మానించి శుభాకాంక్షలు చెబుతున్న జేఏసీ నాయకులు

అనంతపురం అర్బన్: నూతన కలెక్టర్ ఓ.ఆనంద్‌ను ఏపీ వీడబ్ల్యూఎస్ఈ (గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు) జేఏసీ నాయకులు శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి సన్మానించారు. సమస్యల పరిష్కారం కోసం తాము నిరసనలకు శ్రీకారం చుడుతున్నామన్న ముందస్తు సమాచారాన్ని కలెక్టర్‌కు తెలియజేశారు. ఇంటింటి సర్వే, పదోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు, ఇన్‌చార్జ్ విధులు తదితర ఇబ్బందుల గురించి వివరించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు వరప్రసాద్, హనుమంతు, షణ్ముఖానంద రెడ్డి, సల్మాన్‌బాషా, మహేష్, రవికుమార్, శ్రీకాంత్, బాలు యాదవ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

29 నుంచి లా పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్ఎల్‌బీ (మూడు సంవత్సరాల కోర్సు) ఆరో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ (ఐదు సంవత్సరాల కోర్సు) పదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నుంచి అక్టోబర్ 4 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ ఓ ప్రకటన విడుదల చేశారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం: చెడు వ్యసనాలకు బానిసై, డబ్బుల కోసం ద్విచక్రవాహనాల దొంగగా మారిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన బోయ రమణ (35) పలు ప్రాంతాల్లో బైక్‌లు చోరీ చేశాడు. ఈ క్రమంలో అనంతపురంలోని గుత్తిరోడ్డు మేడా పెట్రోల్ బంకు వెనుక కంపచెట్ల వద్ద నుంచి గుత్తికి తరలించేందుకు ఐదు బైక్‌లను సిద్ధం చేసి ఉంచగా.. అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు వెళ్లి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.2.30 లక్షలు విలువ చేసే ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు.

జల్నా-తిరుచానూరు మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్టిలో ఉంచుకొని జల్నా-తిరుచానూరు-జల్నా మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ శనివారం మీడియాకు తెలిపారు. జల్నా జంక్షన్‌లో ఈ నెల 21 (ఆదివారం) నుంచి అక్టోబర్ 26 వరకు వీక్లి ఎక్స్‌ప్రెస్(07601)గా (6 సర్వీసులు) మాత్రమే నడుపుతున్నట్లు వెల్లడించారు. తిరుగు ప్రయాణంలో తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి ఈ నెల 22 (సోమవారం) నుంచి అక్టోబర్ 27 వరకు వీక్లి ఎక్స్‌ప్రెస్ (07602)గా (6 సర్వీసులు) నడుపుతున్నట్లు వివరించారు. ఈ రైళ్లు రాయలసీమ జిల్లాలోని మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం. ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, తిరుపతి జంక్షన్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రసాద్‌బాబు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా రాచేపల్లి ప్రసాద్‌బాబును నియమిస్తూ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన శింగనమల నియోజకవర్గానికి చెందిన వారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కార్మికునికి షాక్



చికిత్స పొందుతున్న ఎస్‌కే బైసి

రాప్తాడు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేట్ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫిట్టింగ్ పనులు జరుగుతున్నాయి. రాప్తాడు సమీపంలో ఉంటున్న గోపాల్ అనే కాంట్రాక్టర్ తన కూలీలలో ఈ పనులు చేయిస్తున్నాడు. సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్నామని విద్యుత్ అధికారులు చెప్పడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్‌కే బైసి అనే కార్మికుడు శనివారం సాయంత్రం ఎస్‌వీఐటీ కళాశాల వెనుక వైపు 11 కేవీ పోల్ మీద కూర్చొని జంపర్‌కు కనెక్షన్ ఇస్తున్నాడు. ఇంతలో సబ్‌స్టేషన్ సిబ్బంది విద్యుత్‌ను సరఫరా చేయడంతో పోలు మీద ఉన్న ఎస్‌కే బైసి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. మండల విద్యుత్ ఏఈ శివ ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో ఎల్‌సీ తీసుకుని పోల్‌లో మరమ్మతు పనులు చేయించాల్సి ఉంది. అయితే ఏఈ నిర్లక్ష్యం వలన ఆయన ఎల్‌సీ తీసుకోకుండా తన కింది స్థాయి సిబ్బందికి చెప్పడంతో ఎస్‌కే బైసి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఏఈ నిర్లక్ష్యం కారణాంగానే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం బాధితుని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాలికుంటు టీకాలు వంద శాతం వేయాలి

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ప్రేమ్‌చంద్ శనివారం నగరంలోని సాయినగర్‌లో ఉన్న పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీ డీఎల్), అలాగే వెటర్నరీ హాస్పిటల్ (వీహెచ్)ను తనిఖీలు చేశారు. పశువైద్య సేవలు గురించి ఏడీ డాక్టర్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు (ఫుట్ అండ్ మౌత్ డిసీసెస్- ఎఫ్ఎండీ) వ్యాక్సినేషన్ పరిస్థితి గురించి ఏడీడీఎల్ ఏడీ డాక్టర్ రవిబాబును అడిగి తెలుసుకున్నారు. అక్టోబర్ 15లోపు జిల్లాలో ఉన్న అన్ని పశువులు, గేదెలు, ఎద్దులకు వంద శాతం వ్యాక్సినేషన్లు చేపట్టి ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. పశుసంరక్షణ, జీవసంరక్షణ, జీవాలకు నిర్వహిస్తున్న పోస్టుమార్టం, వెటర్నరీ ల్యాబ్‌ల పనితీరు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వీఏఎస్ డాక్టర్ శృతి, వీఎల్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శోభాబిందుకు ఉత్తమ అవార్డు



అవార్డును అందజేస్తున్న ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్, ఇంక్యుబేషన్ డైరెక్టర్ డాక్టర్ సి.శోభాబిందుకు ఉత్తమ ప్రతిభావంతమైన మహిళా ఇంజినీర్ అవార్డు దక్కింది. ఈ మేరకు ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ విభాగం వెల్లడించింది. శనివారం విజయవాడలోని కేఎల్ రావు భవన్‌లో 58వ ఇంజినీర్స్‌డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. ఇనిస్టిట్యూట్ ఇంజనీర్స్ ఏపీ సెక్షన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా శోభాబిందును జేఎన్‌టీయూ (అనంతపురం) వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఓ.దేవన్న, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. వసుంధర అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేయండి



పోస్టింగ్స్ అందుకున్న ఎంపీడీఓలతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: 'మీకొచ్చిన అవకాశాన్ని గొప్ప వరంగా భావించండి. అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేయండి. విధి నిర్వహణలో మీ సమర్థతను నిరూపించుకొని, జిల్లా పరిషత్ ప్రతిష్టను పెంపొందించండి' అంటూ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి నుంచి ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన ఆరుగురికి మండలాలు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో గల తన చాంబర్‌లో పదోన్నతి పొందిన ఎం.శకుంతల(ముదిగుబ్బ), ఎస్.కమలాబాయి(గోరంట్ల), ఎస్.మాధవి(కుందుర్పి), వి.జయరాములు (గుమ్మఘట్ట), జి.శ్రీనివాసులు (అమడగూరు), జి.ఆనంద్ ప్రసాద్‌ను రొద్దం ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు అందించి, శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆమె కర్తవ్య బోధ చేశారు. కార్యక్రమంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య, ఏఓలు షబ్బీర్ నియాజ్, విజయభాస్కర్‌రెడ్డి, రత్నాబాయి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్ఓ మలోల, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది

అనంతపురం అర్బన్: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జేసీ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఆయన డీఆర్ఓ మలోల, అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షించి భావితరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అలాగే పరిశుభ్రతను పాటించడం ద్వారా వాతావరణ కాలుష్యానికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి స్వచ్ఛందంగా స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి అలెగ్జాండర్, విభాగాల సూపరింటెండెంట్లు వసంత లత, యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జ్ జయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్లు దివాకర్‌రావు, బాషా, శ్రీనివాసమూర్తి, కనకరాజు, మారుతీప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం



ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లచెరువు: భార్యపై హత్యాయత్నం చేసిన ఘటన శనివారం నల్లచెరువులో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మ వీధిలో నారాయణస్వామి, బాలమణి దంపతులు నివాసముంటున్నారు. ఇటీవల నారాయణస్వామి తాగుడుకు అలవాటుపడ్డాడు. కూలి పనులు చేసి వచ్చిన సంపాదనంతా మద్యానికే ఖర్చు చేసేవాడు. తాగుడు మానుకోవాలని దండిస్తుండటంతో భార్యపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో పనిచేసుకుంటున్న భార్యను వెనుకనుంచి వచ్చి వీపు భాగంలో కత్తితో పొడిచి పారిపోయాడు. బాలామణి బాధ భరించలేక గట్టిగా కేకలు వేసింది. స్థానికులు వచ్చి ఆమెను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం



రమణ (ఫైల్)

పెద్దవడుగూరు : చింతలచెరువు గ్రామానికి చెందిన రమణ (38) జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. రమణ కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానాలని కుటుంబ సభ్యులు చెప్పినా వినిపించుకోలేదు. శుక్రవారం రాత్రి మద్యం తాగొచ్చి భార్య చౌడేశ్వరితో గొడవపడ్డాడు. తర్వాత కాసేపటికి పురుగుమందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అనంతపురంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ ఆంజినేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీకి కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎస్ఐలు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1993, 1995 బ్యాచ్‌కు చెందిన 36 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి లభించింది. వీరందరూ ఎస్పీ జగదీష్‌ను శనివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే జిల్లా పోలీస్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్, స్టడీ సెంటర్, డిజిటల్ లైబ్రరీలో సన్నద్ధమై పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు దక్కించుకున్న 48 మంది కూడా ఎస్పీని కలిశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, సరోజ పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు నెల్లూరు, బీకేఎస్ జట్లు



ఫైనల్‌కు చేరిన బీకేఎస్ జట్టు

బుక్కరాయసముద్రం: జంతలూరులో రెండు నెలలుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శనివారం సెమీ ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు, బళ్లారి జట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసింది. తరువాత బరిలోకి దిగిన బళ్లారి జట్టు 156 పరుగులకు ఆలౌట్ అయ్యి ఓటమి పాలైంది. దీంతో నెల్లూరు జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఇది ఇలా ఉండగా సెమీ ఫైనల్‌లో జంతలూరు జట్టుపై గెలిచిన బీకేఎస్ జట్టు కూడా ఫైనల్‌కు అర్హత సాధించింది. ఆదివారం నెల్లూరు – బీకేఎస్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పోటీల ముగింపు సందర్భంగా నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

వివాహిత ఆత్మహత్య

- మృతురాలు అసోం వాసి



మృతురాలు జిన్నిబాయి

గుంతకల్లు: అసోం రాష్ట్రానికి చెందిన ఓ వివాహిత గుంతకల్లులోని ఓ లాడ్జీలో ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అసోంకు చెందిన టబాజిట్, ఆయన భార్య జిన్నిబాయి (19)తోపాటు ఇద్దరు సమీప బంధువులు పట్టణంలోని అశోక ప్యారడైజ్ హోటల్ పనిచేస్తున్నారు. దీంతో వీరికి యాజమాన్యం బస కోసం సమీపంలోని రూమ్‌లు కేటాయించింది. అయితే జిన్నిబాయి తరచూ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో టబాజిట్ గొడవ పడేవాడు. రెండు రోజులుగా టబాజిట్ డ్యూటీకి వెళ్లకుండా రూమ్‌లోనే ఉండేవాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య శుక్రవారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. మనస్తాపం చెందిన జిన్నిబాయి అదే రోజు అర్ధరాత్రి భర్త బాత్రూమ్‌లోకి వెళ్లాక గడియ పెట్టేసి.. ఆమె గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. భర్త డోర్ తెరవడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో గట్టిగా కేకలు వేశాడు. దీంతో పక్క రూమ్‌లో ఉన్న టబాజిట్ సోదరుడు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా ఫ్యాన్‌కు వేలాడుతున్న మరదలు జిన్నిబాయిని చూసి ఆందోళనకు గురైయ్యాడు. వెంటనే బాత్‌రూమ్ డోర్ ఓపెన్ చేయడంతో బయటకు వచ్చిన టబాజిట్ భార్యను చూసి బోరుమన్నాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని కిందకు దింపి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ మస్తాన్ కేసు నమోదు చేశారు.

ఏపీఎంఐపీకి 'స్కోచ్' అవార్డు

అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) ద్వారా జిల్లాలోని రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు అందించి రాష్ట్రంలో తొలిస్థానం, దేశంలో రెండో స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లాకు ప్రతిష్టాత్మక 'స్కోచ్-గోల్డ్' అవార్డు దక్కినట్లు ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్కోచ్ గ్రూపు వ్యవస్థాపక చైర్మన్ సమీర్‌కొచ్చర్ నుంచి అప్పటి ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్‌తో కలిసి అవార్డు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 18 వేల హెక్టార్ల లక్ష్యం కాగా 15,060 హెక్టార్లకు డ్రిప్ యూనిట్లు, 2,852 హెక్టార్లకు స్ప్రింక్లర్లు పంపిణీ చేసి రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచామన్నారు.



అవార్డు అందుకుంటున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి, కర్నూలు ఏపీడీ ఫిరోజ్‌బాషా

29 జీవాల అపహరణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు రైల్వేగేటు సమీపంలో నివాసం ఉండే నాయకుల జయలక్ష్మికి చెందిన 29 జీవాలు అపహరణకు గురైన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. జయలక్ష్మి జీవాల పెంపకంతో జీవనం సాగిస్తోంది. ఇంటి పక్కనే ఉన్న పాకలో జీవాలను ఉంచుతారు. శుక్రవారం రాత్రి 10 గంటల వరకు జీవాలు ఉన్నాయి. శనివారం తెల్లవారుజామున నిద్రలేచి చూసే సరికి పాకలోని 25 మేకలు, ఒక పొట్టేలు, మూడు మేక పిల్లలు కనిపించలేదని జయలక్ష్మి కన్నీరుమున్నీరైంది. దాదాపు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితురాలు తెలిపింది. సీఐ జయనాయక్ శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేశారు.

షోరూం నిర్వాహకులపై కేసు

అనంతపురం: నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న దుర్గ ఆటోమోటివ్స్ నిర్వాహకులపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... శివప్రసాద్ అనే వ్యక్తి దుర్గ ఆటోమోటివ్స్ షోరూంలో ఎర్టిగా కారు కొనుగోలు చేశాడు. ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం మొత్తం దుర్గ ఆటోమోటివ్స్ ఖాతాకు జమైంది. అయితే కారు మాత్రం డెలివరీ ఇవ్వలేదు. పలు మార్లు తిప్పించుకుని ఇదిగో..అదిగో అంటూ కాలయాపన చేశారు. దీంతో దుర్గ ఆటోమోటివ్స్ షోరూం నిర్వాహకులు అయిన రాజేష్, వెంకటేశ్వరరావు, సేల్స్‌మెన్ రాజశేఖర్‌పై చీటింగ్ కేసు నమోదు చేయాలని బాధితుడు శివప్రసాద్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

వాహనమిత్ర దరఖాస్తు గడువు పొడిగించాలి


డీటీసీ వీర్రాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: వాహనమిత్ర పథకానికి దరఖాస్తు గడువు పొడిగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రవాణాశాఖ కార్యాలయంలో డీటీసీ వీర్రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వర్ సమస్య వల్ల 50 శాతానికి పైగా ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు దరఖాస్తు చేసుకోలేదన్నారు. అలాగే చాలా మంది ఆటో డ్రైవర్లకు లైసెన్స్ లేకపోవడం వల్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్, సహాయ కార్యదర్శులు రమేష్, నాగేంద్ర, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల కోసం జాబ్‌మేళా

అనంతపురం కల్చరల్: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ అధ్యక్షతన వేలాది మంది బ్రాహ్మణ నిరుద్యోగుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు ఏఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. ఈ మేరకు శనివారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 13న మేళా జరుగుతుందన్నారు. 2,500 మంది లబ్ధి పొందేలా ఉద్యోగ కల్పన చేయడానికి వివిధ కంపెనీల్లోని బ్రాహ్మణ నాయకులు కృషి చేస్తున్నారన్నారు. మరో రెండు రోజులు గడువు ఉందని, ఎటువంటి రుసుము లేకుండా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440922668 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా పోషణ మహోత్సవం


తల్లీబిడ్డ ఫొటో తీస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం ఎ. నారాయణపురంలో శనివారం పోషణ్ మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న చంటిబిడ్డ తల్లులను ఫొటోలు తీసి అభినందించారు. అనంతరం పోషణ మహోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ కౌసర్ భాను, హెల్పర్ రమాదేవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాప్తాడు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత తెలిపారు. శనివారం రాప్తాడుతోపాటు గాండ్లపర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ మా' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో పౌష్టికాహార మసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు సుఖప్రసవం అవుతారని, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పోషక విలువలతో కూడిన ఆహారం ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు


మాట్లాడుతున్న ఎంవీఐ సునీల్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ 18 ఏళ్లలోపు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని ఎంవీఐ సునీల్‌కుమార్ సూచించారు. స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం 'రహదారి భద్రత'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సునీల్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్ష మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారని, 70 వేల మందికి పైగా క్షతగాత్రులుగా మారుతున్నారని తెలిపారు. బైకులు నడిపేవారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణించరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని విజ్ఞప్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణాలు కాపాడుకోవడం అవసరమన్నారు. కళాశాల ఏఓ శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెలవులొచ్చాయోచ్

పాఠశాలలకు ఈ నెల 22 వతేదీ (సోమవారం) నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. 12 రోజుల దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 3వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో 21 ఆదివారం కావడంతో శనివారమే విద్యార్థులు ఊళ్లకు బయలుదేరారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు ఖాళీ అయ్యాయి. పిల్లలు, వారి తల్లిదండ్రులతో అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


టాటా.. వెళ్లొస్తాం


ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


బస్సులో సీట్ల కోసం అవస్థలు


లగేజీ తీసుకుని ఊర్లకు బయల్దేరిన విద్యార్థులు

విద్యను వ్యాపారంగా మార్చిన 'కూటమి'



నిరసన తెలియజేస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో వైద్య విద్యను కూటమి ప్రభుత్వం వ్యాపారంగా మార్చేసిందని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసేందుకు విడుదల చేసిన జీఓ 590ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో శనివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలియజేశారు. అసోసియేషన్ నగర కార్యదర్శి చరణ్ తేజ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ బి. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు ధారదత్తం చేయడం ద్వారా 2,350కు పైగా మెడికల్ సీట్లను అమ్ముకునేందుకు మార్గం సుగమం చేసుకుందన్నారు. దీంతో వైద్య విద్యను చదవాలంటే పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు అందనంత స్థాయికి చేరిపోతుందన్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో చేరాలంటే కనీసం రూ. 50 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చవుతుందన్నారు. ప్రైవేట్‌కు అప్పగిస్తే వైద్య కళాశాలలకు అనుబంధమైన ఆస్పత్రులలో వైద్యానికి అయ్యే ఖర్చును ప్రైవేటు వారే నిర్ణయిస్తారన్నారు. నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే పీపీపీ పద్ధతిని వెంటనే వెనక్కి తీసుకొని ప్రభుత్వ వైద్య కళాశాలలగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ జిల్లా నాయకులు మహమ్మద్, నగర నాయకులు భవ్య, బాబా అలీ, కార్తీక్, నాని పాల్గొన్నారు.

అందని ద్రాక్షలా వైద్యవిద్య


నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు మెడికల్ విద్య అందని ద్రాక్షలా మారుతోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి వీరేంద్రప్రసాద్, ఐసా జాతీయ సభ్యులు వేమన, జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధు వాపోయారు. వైద్య విద్య చదువుకోవడానికి అడ్డుగా ఉన్న 107, 108 జీఓలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఆయా సంఘాల నాయకులు వీరేంద్ర ప్రసాద్, వేమన, సిద్ధు మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు అండగా నిలుస్తామని యువగళం పాదయాత్రలో చెప్పిన లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 1,800 మెడికల్ సీట్లు రద్దు చేయాలని జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు బండారు శంకర్, నాయకులు హేమంత్, సతీష్, రాహులు, ఉదయ్ బాబు, ఉదయ్ కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కుక్కల బెడదకు చెక్ పెట్టేలా..

- స్టెరిలైజేషన్ కాంట్రాక్ట్ ఓకే
- హర్యానాకు చెందిన సొసైటీకి బాధ్యతలు


నగరంలోని ఓ వీధిలో సంచరిస్తున్న కుక్కలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కుక్కల బెడదకు పరిష్కారం చూపే విధంగా పాలకవర్గం అడుగులు ముందుకువేసింది. అందులో భాగంగా హర్యానాకు చెందిన స్నేహ అనిమల్ వెల్ఫేర్ సొసైటీకి కాంట్రాక్ట్ అందించింది. రానున్న రోజుల్లో కుక్కల స్టెరిలైజేషన్‌కు చర్యలు తీసుకోనున్నారు. నగరంలోని 50 డివిజన్లలో వేల సంఖ్యలో కుక్కలున్నాయి. రోజూ కుక్కకాటుతో నగర ప్రజలు సర్వజనాస్పత్రికి క్యూ కడుతున్నారు.

ఒక్కో కుక్కకు రూ.1,500..

స్టెరిలైజేషన్‌కు సంబంధించి ఒక్కో కుక్కకు రూ.1,500 చెల్లించేలా కాంట్రాక్ట్‌లో పేర్కొన్నారు. 2023లో కుక్కల స్టెరిలైజేషన్‌కు పాలకవర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజస్తాన్‌కు చెందిన సంతులన్ జీవ్ కల్యాణ్, జైపూర్ సంస్థ స్టెరిలైజేషన్ ప్రక్రియ కొన్ని రోజులు నిర్వహించింది. సదరు ఏజెన్సీ పీఆర్‌సీ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో నగర పాలక సంస్థ అధికారులు తాత్కాలికంగా స్టెరిలైజేషన్ ప్రక్రియను నిలిపివేశారు. ఈ ఏడాది జనవరి 29న సంతులన్ జీవన్ కల్యాణ్ ఏజెన్సీకి మరోసారి వర్క్ ఆర్డర్ ఇచ్చారు. కానీ వారు ముందుకు రాకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు ఎమర్జెన్సీ నోటీసును సమర్పించి, జూన్ 17న కాంట్రాక్ట్ రద్దు చేశారు. కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో గత నెల 19న జిల్లాకు విచ్చేసిన డీఎంఏ సంపత్‌కుమార్ దృష్టికి మేయర్ తీసుకెళ్లారు. ఈ క్రమంలో స్నేహ అనిమల్ వెల్ఫేర్ సొసైటీకి అప్పగిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు.

శాశ్వత పరిష్కారం చూపుతాం

కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నాం.నగరంలో కుక్కల బెడదపై జిల్లా అధికార యంత్రాంగం, డీఎంఏ, కమిషనర్ తదితరులకు విన్నవించాం. ఎట్టకేలకు కుక్కల స్టెరిలైజేషన్‌కు అనుమతి వచ్చింది. నగర ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.

– వసీం, మేయర్

వక్ఫ్ ఆస్తులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: వక్ఫ్ బోర్డు ఆస్తులు, కంప్యూటర్ రిజిస్ట్రేషన్ వివరాలపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. స్థానిక ఆజాద్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ, విజయవాడ నుంచి విచ్చేసిన ఈవో అబ్దుల్ ఖుద్దూస్, సీనియర్ అడ్వకేట్ అబ్దుల్‌రహమాన్, జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీమ్ హుస్సేన్ తదితరులు మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అందరూ వాటి వివరాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో డీఆర్వో మలోల ఆధ్వర్యంలో వక్ఫ్ ఆస్తులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి విచ్చేసిన ముతవల్లీలతో ఆయన మాట్లాడారు. ప్రతినెల ఒకసారి ఎండోమెంటు సమావేశంలో వక్ఫ్‌బోర్డు అధికారులు కూడా పాల్గొనాలని, అన్ని ఆస్తుల పరిరక్షణ కోసం నడుం బిగించాలని కోరారు. గుత్తిరోడ్డులో గతంలో ఆక్రమణకు గురైన సర్వే నంబర్ 200/1 విస్తీర్ణం 0.98 సెంట్లను పరిశీలించి వాటి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముతవల్లీలు పాల్గొన్నారు.

ఆకాశం..అరుణవర్ణం


పంపనూరు మలహోబిలేశ్వరుని కొండపై అరుణ వర్ణంలో కనిపించిన ఆకాశం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు కొండపై శనివారం సాయంత్రం అద్భుత దృశ్యం కనిపించింది. సూర్యుడు అస్తమిస్తున్న వేళ రవికిరణాలతో ఆకాశం అరుణవర్ణంతో మెరిసిపోయింది. ఇక కొండపై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని విద్యుత్ వెలుగులు ప్రజ్వలించగా.. అరుణకాంతులతో ఆకాశం మిలామిలా మెరిసింది. ఈ రమణీయ దృశ్యాన్ని పలువురు తమ సెల్‌ఫోన్‌లో బంధించి సంబరపడ్డారు.

అలరించిన సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు 102వ జయంతి వేడుకలను శనివారం సాయంత్రం కళాభిమానులు సంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని కృష్ణకళా మందిరంలో అనంత్ నాగ్‌సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో సంగీత గానలహరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమధుర సంగీత స్వరాంజలితో ఆహూతులను అలరించారు. పలువురు గాయనీ గాయకులు అక్కినేని నటించిన వివిధ చిత్రాలలోని పాటలను అభినయంతో ఆలపించిన తీరు అలరించింది. కృష్ణకళామందిరంలో డీఆర్వో మలోల, నాగిన్ ప్రసాద్, శ్రీదేవి తదితరులు అక్కినేని పాటలతో హోరెత్తించారు. ఆఫీసర్స్‌క్లబ్‌లో సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, జీవీరామయ్య, ఓబుళదాసు, ఆచార్య సుధాకరబాబు, మారుతీప్రసాద్ నాయుడు, సూర్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, జ్యోతిరాయల్ తదితరులు ఆ పాత మధురాలతో శ్రోతలను అలరించారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

కళ్యాణదుర్గం (కంబదూరు): కంబదూరు మండలం కర్తనపర్తిలో శుక్రవారం రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. దాదాపు 30 గొర్రెల పిల్లల మెడలు కొరికేశాయి. గ్రామానికి చెందిన మహేంద్ర గొర్రెలు పోషిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రాత్రి సమయంలో గొర్రెల మందలోకి కుక్కలు దూరి సుమారు 30 గొర్రె పిల్లల మెడలు కొరికేశాయి. దీంతో రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని మహేంద్ర కోరుతున్నాడు.

నేడు హాస్యభారతి

అనంతపురం కల్చరల్: ఒత్తిడిని జయించి ఆరోగ్యాన్ని పెంచడానికి 'హాస్యభారతి' కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక చర్చి స్కూల్ సమీపంలోని వివేకానంద యోగభవన్‌లో నిర్వహిస్తున్నట్లు హాస్యరచయిత తరిమెల అమరనాథరెడ్డి, యోగా కేంద్రం అధ్యక్షుడు మేళవాయి రాజశేఖరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లా జానపదకళా వైభవాన్ని, హాస్యాన్ని చాటిన అమ్మళ్లదిన్నె గోపీనాథ్ స్మారకంగా డాక్టర్ హరిప్రసాద్‌కు హాస్యభారతి పురస్కారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమం అనంతరం 'సేవ్ ఆర్టీటీ'కి సంఘీభావం తెలుపుతామన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ

రాప్తాడు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భ్రమరాంబ సూచించారు. శనివారం రాప్తాడు పీహెచ్‌సీలో వైద్యాధికారులు శివ కృష్ణ, శ్రావణి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భ్రమరాంబ మాట్లాడుతూ.. మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాయన్నారు. ఈ క్రమంలోనే 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో 15 రోజుల పాటు మహిళలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం 100 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గంగారాజు, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



రాప్తాడులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, పంపనూరులో మొక్కలు నాటుతున్న ఆలయ సిబ్బంది

రాప్తాడు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె రాప్తాడులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఇప్పటికే ఉన్న చెట్లను సంరక్షించాలన్నారు. లేకపోతే మానవ మనుగడే ఉండదని హెచ్చరించారు. ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూ ఏఈ వరలక్ష్మి, ఏపీఓ సావిత్రి, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఆత్మకూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నాటాలని అధికారులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను కూడా బాధ్యతగా తీసుకోవాలని ఏపీఓ వెంకటనారాయణ, ఎంఈఓ రామాంజినేయులు అన్నారు.

'మినర్వా'లో ముందస్తు దసరా వేడుకలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాలలో శనివారం ముందస్తు దసరా వేడుకలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా అమ్మవారి అలంకరణలో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. వీరు ప్రదర్శించిన 'మహిషాసురవధ' అనే దృశ్య కావ్యం విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జి.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ వైశిష్ట్యాన్ని, ఆధ్యాత్మిక,సాంస్కృతిక విలువలను వివరించారు.


'మహిషాసురవధ' నాటకం ప్రదర్శిస్తున్న బాలికలు

కాలుష్య నియంత్రణపై అవగాహన


మొక్క నాటుతున్న అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛతా హీ 'సేవ' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, ఎన్ఎస్ఎస్ పీఓ విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌పై అవగాహన

రాప్తాడు: మహిళా సంఘాల్లోని సభ్యుల పొదుపు, రుణ వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. 'మన డబ్బులు-మన లెక్కలు' పేరుతో రూపొందించిన ఈ యాప్‌పై శనివారం రాప్తాడులో స్థానిక ఐకేపీ కార్యాలయంలో పండమేటి రాయుడు గ్రామ సంఘంలోని 27 సంఘాల్లోని స్వయం సహాయక సభ్యులకు ఏపీఎం సునీత అవగాహన కల్పించారు. ముందుగా గ్రామైఖ్య మహిళ సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించి, స్థానిక బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎం సునీత మాట్లాడారు. 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌ను ప్రతి సభ్యురాలూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ త్వరలోనే అమల్లోకి వస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్తి హోమం


హోమం జరిపిస్తున్న వేద పండితులు

అనంతపురం కల్చరల్: గతించిన పెద్దల పుణ్యముక్తి కోసం జిల్లాలో తొలిసారి ప్రతిష్టాత్మకంగా సాగిన ముక్తి హోమం, ముక్తి దీప కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. మహాలయ పక్షాలను పురస్కరించుకుని సాయిట్రస్టు వారు స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో వేదపండితులు బాలాజీ శర్మ, సురేష్ గరుడాద్రితో పాటు రెండు జిల్లాల నుంచి విచ్చేసిన పురోహితుల మంత్రోచ్చాటనల నడుమ వినూత్నంగా హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. మహాన్యాసక పూర్వక రుద్రాభిషేకాలు, మోక్షరాయుని ముక్తి దీపంలో వందలాది మంది భాగస్వాములై పితృ తర్పణాలను వదులుకున్నారు. ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర మాట్లాడుతూ ఇప్పటి వరకు తాము 1,791 మంది అనాథలకు అంతిమ సంస్కారాలను నిర్వహించామన్నారు. వీరమరణం పొందిన సైనికులు, విధి నిర్వహణలో ప్రాణాలొదిన వారికి కూడా హోమగుండాలను ఏర్పాటు చేసి ముక్తి ప్రసాదం కోసం హోమం నిర్వహించామన్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాద సేవ జరిగాయి.

శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు



వడ్డుపల్లిలో విద్యుత్ దీపాలతో అలంకరించిన సుంకులమ్మ ఆలయం (ఇన్‌సెట్‌లో) అలంకరణలో అమ్మవారు

ఆత్మకూరు: దసరా శరన్నవరాత్రులకు మండలంలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వడ్డుపల్లి గ్రామంలో వెలసిన సుంకులమ్మ తొమ్మిదిరోజుల పాటు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరులోని వాసవీమాత, పంపనూరులోని పార్వతి దేవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.